క్లుప్తంగా

బదిలీ ఈఓకు సన్మానం



పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్ అయ్యమ్మ, సిబ్బంది

కోసిగి: కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా పనిచేసి బదిలీపై వెళ్లిన పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డిని గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఘన సన్మానం చేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇటీవల ఈఓగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ సమక్షంలో సచివాలయ ఉద్యోగులతో కలిసి బదిలీపై వెళ్లిన ఈఓ తిరుమలేశ్వర రెడ్డిని శాలువా, పూలమాలలు వేసి సన్మానం చేశారు. ఆయన కోసిగి నుంచి బదిలీపై డోన్ మండలం దొరపల్లి పంచాయతీ ఈఓగా వెళ్లినట్లు తెలిపారు. సన్మానంలో గ్రామస్తులు మాణిక్యరాజు, కోసిగయ్య, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కౌతాళం: స్థానిక రైతు సేవా కేంద్రాన్ని ఆదోని సబ్‌కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల సరఫరాపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎరువులు ఎంఆర్‌పీకే అమ్ముతున్నారా లేదా అన్న విషయాలపై ఆరా తీశారు. రైతులందరికీ ఎరువులు అందేలా చూస్తామన్నారు. యూరియా కొరతపై రైతులు ఆవేదన వ్యక్తం చేయగా.. అందరికీ ఎరువులు ఇస్తామని మూడు నాలుగు రోజుల్లోపు ఎలాంటి సమస్య లేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట ఏఓ శేషాద్రి ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

గోనెగండ్ల : పాడి రైతులు తమ పశువులకు మద్ద చర్మ వ్యాధి టీకాలు వేయించాలని కర్నూలు డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ దుర్గా ప్రసన్న సూచించారు. మంగళవారం స్థానిక పశు సంవర్ధక శాఖ వైద్యశాలలో టీకాల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్దచర్మ వ్యాధి టీకాల కార్యక్రమం జిల్లాలోని అన్ని గ్రామాలలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మద్దచర్మ వ్యాధి టీకాలను పాడి రైతులు తమ పశువులకు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సాయం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో మంగళవారం కురువ అయ్యన్న అనే వ్యక్తి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి కాంట్రాక్టర్ బసవరాజు ద్వారా బాధిత కుటుంబానికి మట్టి ఖర్చులకై రూ.5 వేలు సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కాంట్రాక్టర్ బసవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.అంజినిరెడ్డి, బోంపల్లి ఈరన్న, శివయ్య, కె.రామిరెడ్డి, బసిరెడ్డి, ఇషాక్, కోసిగి నాగరాజు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు.

29న వేలం పాటలు

ఆదోని టౌన్: లీజు కాలం పూర్తి చేసుకున్న ఆదోని పురపాలక సంఘ షాపులను మూడు సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేందుకు ఈనెల 29వ తేదీన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. 29న ఉదయం 11 గంటలకు మొత్తం 13 షాపులకు బహిరంగ వేలం పాటలు వేస్తున్నట్లు చెప్పారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని 8 షాపులు, ద్వారకా సినిమా టాకీస్ ఎదురుగా ఒకటి, సంతపేట బాయ్స్ స్కూల్ వద్ద ఒకటి, ఇద్రూస్ వెల్, పి.ఎస్ రోడ్డులోని ఒక్కొక్కటి, హెచ్‌బీ చౌక్లీ జి.హెచ్ రోడ్డులో రెండు షాపులు ఉన్నాయన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 ఏడాది గాను పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు పూర్వపు విద్యార్థులు ప్రతాప్ కమలాకర్, కరణం సుధీర్, రమేష్, రాజా శరత్‌కుమార్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మంగళవారం పాఠశాల హెచ్‌ఎం జాన్సన్ చేతుల మీదుగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించారు. 10వ తరగతిలో పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన మేకల చరితకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వడ్డే బాలాజీకి రూ.8 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన బోయ సురేంద్రకు రూ.6 వేలు నగదు అందించి సత్కరించారు.

నిరుద్యోగుల ఎదురుచూపులు!

- 20 లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి హామీ
- అధికారంలోకి వచ్చి ఏడాదైనా నిరుద్యోగ భృతిపై స్పష్టత కరువు
- ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- అసలు అమలు చేస్తారా? అని అనుమానం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు



గోనెగండ్ల : ఇంటికో ఉద్యోగం వచ్చేంతవరకు .. నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తానంటూ ఎన్నికల సమయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా నిరుద్యోగ భృతిపై నోరు మెదపకపోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురుచేస్తోంది. యువతి యువకులకు భారీ సంఖ్యలో కొలువులు వస్తాయని.. లేదంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

నిరుద్యోగుల ఎదురుచూపులు

మండలంలో డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు బీఈడీ, టీటీసీ, ఇంటర్మీడియెట్, పదో తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం ఆశ పడేవారు 5వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంతవరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల్లో ప్రచారం చేశారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆర్థిక సమస్యలతో ఆగిపోయిన వారంతా కూటమి ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగ భృతితో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ పాత పాటే...

2014లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.2వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారు. 2019లో ఎన్నికల ముందు రెండు నెలలు భృతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేశారు. అలాగే ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి మిన్నకుండిపోయారు. ఇప్పుడు కూడా చంద్రబాబు తమను మోసం చేస్తారేమోనన్న అనుమానాన్ని నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

ఎదురు చూపేనా ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2లక్షల ఉద్యోగాలు, లేని పక్షంలో రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికార పగ్గాలు చేపట్టి సంవత్సరం పూర్తి అయినా అతీగతీ లేదు. అసలు ఇస్తారా? లేదా? అనే విషయంపైనా స్పష్టత లేదు. 2019 ఎన్నికల ముందు తూతూ మంత్రంగా ఇచ్చారు. ఇప్పుడు అదే పంథా కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

– ఇమ్రాన్, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి, గోనెగండ్ల

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాలి



జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైతే ఉద్యోగానికి లక్షలాది మంది వయో పరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇవ్వాలి. లేకుంటే నిరుద్యోగ భృతిని అమలు చేయాలి.

– భరత్ కుమార్, గోనెగండ్ల

మాట నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై మాట నిలుపుకోవాలి. ప్రభుత్వం వచ్చి సంవత్సరం పూర్తి అయినా దీనిపై సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై మాలాంటి నిరుద్యోగుల్లో అనుమానం కలుగుతోంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలపై సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి.

– మునిస్వామి, ఏఐఎస్‌ఎఫ్ తాలూకా అధ్యక్షుడు, గోనెగండ్ల

ఫిల్టర్ నీటినే సరఫరా చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరి

గోనెగండ్ల : వర్షాకాలంలో తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని, ఫిల్టర్ చేసిన నీటినే కుళాయిలకు సరఫరా చేయాలని ఎంపీపీ నసురుద్దీన్ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన, ఎంపీడీఓ మణి మంజరి ఆధ్వర్యంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మల్టీ విలేజ్ స్కీమ్ కింద 15 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు రూ.19.5కోట్లు ఇప్పటికే మంజూరైన విషయం తెలిసిందేనన్నారు. ఈ నిధులతో మండలంలోని 12 గ్రామాలు గాజులదిన్నె, హెచ్. కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, పెద్దనేలటూర్, చిన్న నేలటూర్, కులుమాల, పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, నెరుడుప్పల, ఎర్రబాడు, వీరంపల్లితో పాటు ఎమ్మిగనూరు మండలంలోని రాళ్లదొడ్డి, ఎర్రకోట, కడిమెట్ల గ్రామాలకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి తాగునీరు అందించే పథకం ఎంవీఎస్ పనులు ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. డిసెంబర్ చివరి నాటికీ పనులు పూర్తి చేసి ఆ గ్రామాలకు మంచినీటిని అందిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రాజేశ్వరి, పీఆర్‌ఏఈ శివ శంకర్, ఏఓ హేమలత, కోఆప్షన్‌మెంబర్ రావూఫ్, ఈఓఆర్డీ అనంతసేన తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు బస్సు నడపాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆర్టీసీ బస్సు నడపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. పీడీఎస్‌యూ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కన్నడ నటుడు



దర్మకీర్తిరాజ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం రూరల్: కన్నడ సినీనటుడు ధర్మకీర్తి రాజ్ మంగళవారం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆయనకు మెమోంటో, స్వామి శేషవస్త్రంతో ఆశీర్వాదించారు.



నానో యూరియా వాడాలి



టీఎస్ కూళ్లూరులో రైతులతో మాట్లాడుతున్న ఏవో మదిరేపల్లి శివశంకర్, రైతులు

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటల సాగులో సాధారణ యూరియా బదులుగా నానో యూరియా వాడకం అలవాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మదిరేపల్లి శివశంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కె.తిమ్మాపురం, టీఎస్.కుళ్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలకు యూరియాను అధిక మోతాదులో వాడుకోవడం తగ్గించాలని, అవసరం మేరకే వాడుకోవాలని చెప్పారు. నానో యూరియా స్ప్రే చేయడం వలన 100 శాతం సమర్థవంతంగా పంటలకు ఉపయోగపడుతుందని, అదే మాములు యూరియా వాడితే 50 శాతం వేస్టేజ్ అవుతుందని తెలిపారు. పత్తి పంటకు రసం పీల్చే పురుగుల నివారణకు నీలం, పసుపు, తెలుపు రంగు జిగురు అట్టలను, లింగాకర్షణ బుట్టలను ఎకరాకు 20 నుంచి 30 చొప్పున పెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవోలు నరసింహుడు, వినోద్, రసూల్, జ్యోతిర్మయి, రైతులు పాల్గొన్నారు.

యూరియా సక్రమంగా పంపిణీ చేయాలి



వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ఆదోని రూరల్: మండలంలోని రైతులకు యూరియాను సక్రమంగా అందించాలని మంగళవారం ఆదోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో యూరియా కోసం రైతులు రోజుల తరబడి లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కృత్రిమంగా యూరియా కొరతను సృష్టిస్తున్నారన్నారు. దీంతో ఏఓ సుధాకర్ ఎమ్మెల్యే పార్థసారథితో మాట్లాడి సాయంత్రానికి వంద మంది రైతులకు యూరియాను అందించారు.

ప్రతి రైతుకి యూరియా అందించాలి

మంత్రాలయం రూరల్ : పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు యూరియా అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని సుగూరు గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వీఏఏ మాదన్నకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సుగూరు గ్రామంలో వ్యవసాయ భూమి 4,000 ఎకరాలకు గాను కేవలం ఒక లోడ్ మాత్రమే యూరియా వచ్చిందన్నారు. కేవలం 300 బస్తాల యూరియా రైతులకు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి గాబ్రియెల్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మస్తాన్, నాయకులు కుబేరు, యోహాన్, నరసన్న, శ్రీనివాసులు, సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

అనీమియా ముక్త్‌భారత్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫార్మసీ విద్యార్థినులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ బీ-ఫార్మసీ కాలేజీ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎర్రకోట జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అనీమియా ముక్త్‌భారత్‌పై అవగాహన కల్పించారు. బీ-ఫార్మసీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాగేష్ మాట్లాడుతూ ప్రతి రోజు మనం తినే ఆహారంలో పండ్లు, కూరగాయలను తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని, రక్తహీనతకు గురికాకుండా ఉంటారని చెప్పారు. పోషకాహారం తీసుకోకుండా అనీమియా వ్యాధి బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. అనీమియా లక్షణాలు, నివారణ చర్యలుపై విద్యార్థినులు వీడియో ద్వారా డెమోను చూయించి విద్యార్థులకు అర్థం అయ్యేలా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గౌసియాబేగం, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు రాజశేఖర్, రాధ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో 13వ చతుర్మాస సంబరాలు



పీఠాధిపతికి తులభారం చేస్తున్న దృశ్యం

మంత్రాలయం: శ్రీమఠంలో మంగళవారం 13వ చతుర్మాస దీక్ష మహోత్సవ శుభసందర్భంగా శ్రీమఠం కారిడార్‌లో అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం హరికథాంబ్రుత పారియణ సేవసమితి ఆధ్వర్యంలో దాససాహిత్యంపై ధార్మిక క్విజ్ పోటీలు నిర్వహించారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థస్వామిజికి నాణ్యాలు, బియ్యం, పప్పు మరియు గోపిచందన వంటి వివిధ పవిత్ర వస్తువులతో కూడిన పుష్పరుష్టితో తులభారం నిర్వహించారు. అలాగే పండిత కేసరి మహా ఉపాధ్యాయ శ్రీరాజ గిరిజాచారిలను సమితి సభ్యులు సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

ఆదోని రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని పార్టీ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అన్నారు. మంగళవారం మండలంలోని విరుపాపురం గ్రామంలో సీనియర్ నాయకులు శివరాములు చేతుల మీదుగా సీపీఐ జెండా ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం మండల కార్యదర్శి ఎల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు కొత్తూరు గంగన్న, నిర్మాణ కార్మిక నాయకులు షేక్షావలి, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

25న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఈనెల 25వ తేదీన ఆదోని ఆవోపా మరియు ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో 14వ విడత స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేస్తున్నట్లు ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పుష్యమి నక్షత్రం రోజున (25-07-2025)న ఉదయం 7 గంటలకు అమూల్యమైన వెలకట్టలేని ఈ మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఔషధం రోగ నిరోధకశక్తి, మేధాశక్తి, మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. 98494 78178 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 25వ తేదీలోపు నమోదు చేసుకున్న వారికి మాత్రమే మందును పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లు అందజేస్తున్న నీలకంఠరెడ్డి, శరణమ్మ దంపతులు

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని వగరూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన నీలకంఠరెడ్డి, శరణమ్మ దంపతులు ఫ్యాన్లు విరాళంగా అందించారు. మంగళవారం గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు నీలకంఠరెడ్డి, శరణమ్మ దంపతుల ఏకైక కుమారుడు వీరారెడ్డి జయంతి సందర్భంగా అతని జ్ఞాపకార్థం 6 ఫ్యాన్లు, 9, 10వ తరగతి విద్యార్థులు 130 మందికి జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశులు, ఉపాధ్యాయులు శిలప్ప, మోహన్‌రావు, ఈశ్వరరెడ్డి, మాబు, ఆనంద్, కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

కోసిగి: స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులకు అడిగి సమస్యలు తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ.. గదుల్లో లైట్లు, ఫ్యాన్‌లు తిరగడం లేదని, దుప్పట్లు ఇవ్వలేదని విద్యార్థులు తెలిపారన్నారు. దీంతో రాత్రిళ్లు దోమల బెడదతో నిద్రించ లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. సంఘం మండల ఉపాధ్యక్షులు సంతోష్, కార్తీక్, విద్యార్థులు ఉన్నారు.

చెత్త సేకరణపై దృష్టి సారించాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నందవరం : పల్లెల్లో చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, స్వచ్ఛ భారత్ డివిజన్ కో ఆర్డినేటర్ నాగరాజు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో చెత్త సేకరణ, రోడ్లపై నిలిచిన మురుగును అధికారులు పరిశీలించారు. అనంతరం మహిళలకు పరిశుభ్రత, చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ..పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలన్నారు. తడి, పోడి చెత్తలను వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, అందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐని రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: దేశంలోనే ఎన్ఎస్‌యూఐని రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పట్టణ కార్యదర్శి ఉమా మహేష్, నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒడిస్సా రాష్ట్రంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ 19 ఏళ్ల విద్యార్థిని వేధిస్తూ అత్యాచారం చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. అత్యాచారానికి ఒడిగట్టిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ రామమూర్తి

పెద్దకడబూరు: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని ఎంఈఓ రామమూర్తి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక(మెయిన్) పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పొగాకు నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో, బజారులలో పెద్దలు, ముసలివాళ్లు సిగరెట్, బీడీ లాంటివి తాగడం, గుట్కాలు, జర్దాలు వేసుకోవడం చూసి తాముకూడా వాటిని తాగడం, తినడం మంచిదేమో అని భావించి పిల్లలు వాటిని తాగడానికి, తినడానికి ప్రయత్నిస్తారన్నారు. అలా చేయడం తప్పు అని చెప్పారు. వాటిని తీసుకోవడం ద్వారా దాదాపు 16రకాలు క్యాన్సర్ బాధిన పడే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

మౌలిక వసతులపై నివేదికలు ఇవ్వండి

మండలంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నివేదికలు ఇవ్వాలని ఎంఈఓ రామమూర్తి సూచించారు. స్థానిక విద్యాధికారి కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు, ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లోని తరగతి గదుల్లో చిన్న చిన్న మరమ్మతులు, గ్రీన్ చాక్ బోర్డులు, పెయింటింగ్ తదితర చిన్నచిన్న సదుపాయాలలో ఏమైనా అవసరం ఉంటే ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, హెచ్‌ఎంలు సంయుక్తంగా పరిశీలించి నివేదికలను ఇవ్వాలన్నారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలి

ఆదోని రూరల్/సెంట్రల్: ఆర్ట్స్ కళాశాల మైదానంలో సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలని ఏఐఎస్‌ఎఫ్ పట్టణ కోశాధికారి శేఖర్, సహాయ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కళాశాల మైదానంలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ ప్రభావంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాళెం ఎస్సీ కాలనీకి చెందిన ఎస్ రాజేష్‌ను ఇసుక టిప్పర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి కాలనీలో ఇంట్లో నుంచి బైక్‌పై ప్రధాన రోడ్డుపైకి వస్తుండగా ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొనడంతో కింద పడగా.. టిప్పర్ టైర్ అతని కడుపు భాగాన తగడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆ వ్యక్తిని కోసిగి ప్రాథమిక కేంద్రంలో తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.